జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

సోమవారం | 22-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 545 పేజీలు: 4 వెల: రూ.7

# కబళించిన.. కోనేరు





* రామలింగేశ్వర పుష్కరిణి వద్ద ఆడుకుంటూ జారిపడిన ఇద్దరు చిన్నారుల మృతి
* కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు
* రక్షణ కంచె లేకపోవడం కారణమంటున్న స్థానికులు
* గతంలోనూ పలు ఘటనలు
* సంతాపం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి శ్రీనివాస్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

**శ్రీకాకుళం/ఆమదాలవలస, డిసెంబరు 21 (వార్త):** సెలవు రోజు కావడంతో పుష్కరిణి పార్కు వద్ద ఆడుకుంటున్న ఇద్దరు విద్యార్థులు నీటిలో జారిపడి మృతి చెందిన ఘటన ఆమదాలవలస పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆమదాలవలస పట్టణం 15వ వార్డు గణేష్ నగర్‌కు చెందిన సురవరపు పవన్ సాయి(8), శంఖం ధనుష్(6)లు ఆదివారం రామలింగేశ్వర పుష్కరిణి వద్దకు ఆడుకునేందుకు వెళ్లారు. మెట్ల వద్ద ఆడుకుంటుండగా ధనుష్ ప్రమాదవశాత్తు నీటిలో జారిపడ్డాడు. దీన్ని గమనించిన పవన్ సాయి అతడిని కాపాడటానికి నీటిలోకి దిగాడు. చిన్న పిల్లలు కావడంతో, పుష్కరిణిలో లోతు ఉండడంతో వీరు మునిగిపోయారు. దీన్ని చూసిన స్థానికులు వెంటనే పుష్కరిణిలో దిగడంతో పాటు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. వీరు వచ్చి ఆ ఇద్దరు పిల్లలను బయటకు తీశారు. ఆ ఇద్దరు పిల్లలను సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఎస్ఐ బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తమ పిల్లల మృతి వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. గతంలో కూడా పలువురు ఈ పుష్కరిణిలో జారిపడి మృతి చెందారని స్థానికులు చెబుతున్నారు. చెరువు చుట్టూ సరైన రక్షణ కంచె లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### విద్యార్థుల మృతికి సంతాపం

ఆమదాలవలస రామలింగేశ్వర కోనేరులో ప్రమాదవశాత్తు జారిపడి ఇద్దరు చిన్నారులు మృతి చెందడం పట్ల కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, జిల్లా ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇదే తరహా ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కోనేరు ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



# టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా మొదలవలస రమేష్

* ప్రధాన కార్యదర్శిగా విఠల్‌రావు

**శ్రీకాకుళం, డిసెంబరు 21 (వార్త):** టీడీపీ శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడిగా మొదలవలస రమేష్, ప్రధాన కార్యదర్శిగా పీరుకట్ల విఠల్‌రావును నియమిస్తూ అధిష్టానం ఆదివారం నియమిస్తున్నట్టు ప్రకటించింది. ఆమదాలవలస పట్టణానికి చెందిన రమేష్ 1983లో టీడీపీలో చేరారు. 1984లో తెలుగు విద్యార్థి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, 1984 నుంచి 87 వరకు జిల్లా తెలుగు విద్యార్థి అధ్యక్షుడిగా ఉన్నారు. 1995లో ఆమదాలవలస నగర పంచాయతీ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా పోటీ కూడా చేశారు. కళింగ కులానికి చెందిన రమేష్‌కు మొదటి నుంచి టీడీపీని అంటిపెట్టుకునే ఉండి సేవలు అందించారు. అలాగే జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్‌గా ఉన్న పీరుకట్ల విఠల్‌రావును టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అధిష్టానం నియమించింది. పలాస మండలం పెదంచల గ్రామానికి చెందిన విఠల్‌రావు సీనియర్ కార్యకర్తగా గుర్తింపు పొందారు. కాపు సామాజికవర్గానికి చెందిన ఈయన మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ, కింజరాపు ఎర్రన్నాయుడులకు అనుచరులుగా ఉండేవారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన మొదలవలస రమేష్, విఠల్‌రావులను టీడీపీ నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.





# నేరస్థుల ముఠా అరెస్టు

**శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 21 (వార్త):** నేరస్థుల ముఠాను శ్రీకాకుళం పోలీసులు ఆదివారం అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. శ్రీకాకుళం నుంచి తండ్యాంవలసకు వెళ్లే రోడ్డులో పాత ఆర్టీవో ఆఫీసు వద్ద నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో ఐదుగురు యువకులు అనుమానాస్పదంగా ఉన్నట్లు పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. శ్రీకాకుళం రూరల్ స్టేషన్ ఎస్ఐ రాము, పోలీసుల బృందంతో కలిసి వెళ్లి చూడగా వారంతా పాత నేరస్థులుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని పోలీసు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారిని తమదైన శైలిలో పోలీసులు విచారించగా పలు వివరాలు బయటపడ్డాయి. దీనిపై ఎస్పీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో మీడియాకు వివరించారు. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరుకు చెందిన పంచి రెడ్డి కైలాస్, గుజరాతీపేటకు చెందిన అలబణి రమణ, పెద్దపాడుకు చెందిన కలగ ఉమామహేశ్వరరావు, కోటబొమ్మాళి మండలం నారాయణ వలసకు చెందిన ఉర్జాన ప్రశాంత్‌కుమార్, నగరంలోని ఎల్‌బీఎస్ కాలనీకి చెందిన దండాశి కార్తీక్‌లు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పలువురు ఇచ్చిన సమాచారం మేరకు వారిపై దాడులు చేశామన్నారు. వీరి వద్ద పిస్తోలు, తూటాలు, 5 సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకున్నామన్నారు. కైలాస్‌పై ఎచ్చెర్ల, శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో మూడు కేసులు ఉన్నాయన్నారు. ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామంలో ఇటీవల హత్యకు గురైన సత్తారు గోపీ సన్నిహితుడని వివరించారు. ఇద్దరూ కలిసి ఒడిశాలోని బ్రహ్మపురలో ఆరు నెలల కిందట పిస్తోలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. గుజరాతీపేటకు చెందిన అలబణి రమణ (32)పై ఎచ్చెర్ల, ఒకటో పట్టణ పోలీసుస్టేషన్లలో మూడు కేసులు, ఉర్జాన ప్రశాంత్‌కుమార్‌పై జేఆర్‌పురం పోలీసుస్టేషన్లో ఒక కేసు, కలగ ఉమామహేశ్వరరావుపై ఎచ్చెర్లలో ఒక కేసు ఉందన్నారు.

### మహిళ హత్యకేసులో నిందితుడు అరెస్టు

శ్రీకాకుళం నగరంలోని ఏఎస్ఎన్ కాలనీకి చెందిన సీతారత్నం ఈ నెల 2న ఇంటి నుంచి ఆసుపత్రి వెళ్లి హత్యకు గురైన ఘటనలో నిందితుడు గొల్లపల్లి ప్రశాంత్‌కుమార్ (32)ను అరెస్టు చేశామని ఎస్పీ తెలిపారు. నరసన్నపేటకు చెందిన ప్రశాంత్ కుమార్‌తో సీతారత్నంతో వివాహేతర సంబంధం ఉందన్నారు. ఈ నెల 2న శ్రీకాకుళం కిమ్స్ రోడ్డులో వీరిద్దరు కలుసుకున్నారని, డబ్బులు కావాలని సీతారత్నం ప్రశాంత్‌ను బెదిరించింది. దీంతో ఆమెను హత్య చేసి కేశవరావు పేట వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో పడేసి వెళ్లిపోయాడన్నారు. ఆదివారం కింతలి మిల్లు సమీపంలో ప్రశాంత్‌ను పట్టుకున్నామన్నారు. నిందితుడి నుంచి బంగారం పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

### మోసగాడు అరెస్టు

**పలాస, డిసెంబరు 21 (వార్త):** పలువురిని మోసగిస్తున్న కేటుగాడిని కాశీబుగ్గ పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిసా రాష్ట్రం జగన్నాథపురం గ్రామానికి చెందిన లోట్ల లచ్చుమయ్య కారు డ్రైవర్‌గా పని చేసేవాడు. పలాసకు చెందిన సునీల్, ఒడిశాకు చెందిన మరో వ్యక్తి ఈనెల 18వ తేదీన మొగిలిపాడు బ్రిడ్జ్ వద్ద లచ్చుమయ్యను మోసం చేసి పది లక్షలు కాజేశారు. దీంతో లచ్చుమయ్య కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎన్ని రామకృష్ణ కేసు నమోదు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా సునీల్‌ని ఆదివారం అమరావతి డాబా దగ్గరలో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.4,50,000 రికవరీ చేశారు. మరో వ్యక్తి కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయని సీఐ చెప్పారు.

## క్రైం వార్తలు

### నాటు సారా తరలిస్తున్న ఇద్దరు..

నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని కాశీబుగ్గ సీఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం పెదంచల గ్రామ శివారులో మోహనరావు, మరో వ్యక్తితో కలిసి సారా కొనుగోలు చేసుకుని గ్రామంలో అమ్మకానికి తీసుకువస్తుండగా కాశీబుగ్గ ఎస్సై ఆర్ నరసింహమూర్తి సిబ్బంది పట్టుకున్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

### గంజాయితో ఇద్దరు ఒడిశావాసులు..

గంజాయిని తరలిస్తున్న ఇద్దరు ఒడిశావాసులను అరెస్టు చేశామని కాశీబుగ్గ సీఐ రామకృష్ణ వెల్లడించారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం వ్యవసాయ మార్కెట్ గేట్ వద్దా ఒడిశాలోని బల్లి సాహి గ్రామానికి చెందిన రాజేంద్ర షబార్, కర్చాబాద్ గ్రామానికి చెందిన బాజీ గమంగలు సుమారు 10.795 కేజీల గంజాయిని తరలిస్తుండగా కోసంగిపురం జంక్షన్ వద్ద పట్టుకున్నామన్నారు. ఎస్సై ఆర్.నరసింహమూర్తి కేసు నమోదు చేశారని సీఐ తెలిపారు.



చిన్నారులకు పోలియో చుక్కలు..
# రక్షణ కవచం

* కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* పూడివలసలో చిన్నారులకు చుక్కలు వేసిన కలెక్టర్


**శ్రీకాకుళం, డిసెంబరు21(వార్త):** జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులను పోలియో రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ఎచ్చెర్ల మండలం పూడివలస గ్రామంలో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 1,55,876 మంది చిన్నారులకు చుక్కలు వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తొలిరోజు బూత్‌ల ద్వారా శత శాతం లక్ష్యాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తారని, ఏదైనా కారణాల వలన వేసుకొని పిల్లలకు సోమ, మంగళవారాల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తారని వివరించారు. జిల్లాలో మొత్తం 1,252 కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రయాణాల్లో ఉన్న వారి కోసం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో 40 ట్రాన్సిట్ బూత్‌లు, మారుమూల ప్రాంతాల కోసం 84 మొబైల్ బృందాలను రంగంలోకి దించామని తెలిపారు. హైరిస్క్ ప్రాంతాల్లోని 6,732 మంది పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించామని, మొత్తం 7,430 మంది సిబ్బంది ఈ బృహత్తర కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి జిల్లాను పోలియో రహితంగా మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. రాందాసు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కె.అనిత తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్య సమాజానికి పోలియో చుక్కలే పునాది

**సోంపేట డిసెంబరు 21(వార్త):** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో పిల్లలకు వేసే పోలియో చుక్కలు పునాదిగా నిలుస్తాయని కంచిలి ఏఎంసి చైర్ పర్సన్ మద్దిల విజయలక్ష్మి, మాకన్నపురం సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మాకన్నపురంలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదేళ్ల లోపు ప్రతి పిల్లాడికి తప్పకుండా పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని వారు అన్నారు. భవిష్యత్తులో పోలియో రాకుండా నిర్మూలనకు ఈ చుక్కలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. అలాగే సోంపేట పట్టణంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని స్థానిక కోదండరామ ఆలయ కమిటీ చైర్మన్ బీన ఆనందరావు చేతుల మీదుగా ప్రారంభమైంది. ఐదేళ్ల లోపు గల పిల్లలకు తల్లిదండ్రులు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.







## అన్నదాన పథకానికి లక్ష వితరణ

**అరసవల్లి, డిసెంబర్ 21 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమానికి కొటికలపూడి వెంకటేశం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాసరావు రూ.1,00,001లను చెక్కు ద్వారా ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రసాద్‌కు ఆదివారం అందజేశారు. తొలుత స్వామి వారిని శ్రీనివాసరావు దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. అలాగే శాంత బయోటెక్నిక్స్ చైర్మన్ వరప్రసాద్ రెడ్డి, కూచిపూడి నృత్య కళాకారిణి స్వాతి సోమనాథ్, దక్షిణ భారత చలన చిత్ర నటి, శాస్త్రీయ నృత్యకారిణి జయలలిత.. సూర్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. అలాగే పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి పోటెత్తారు. స్వామి వారికి టికెట్లు రూపేనా రూ.2,25,700, పూజలు విరాళాల రూపంలో రూ.54,122, ప్రసాదాల రూపంలో రూ.1,55,855, దర్శనం, సూర్యనమస్కారములు, వివిధ సేవలు ప్రసాదాల బుకింగ్‌ను మరింత సులభతరం చేస్తూ ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా మొత్తం రూపంలో రూ. 88,931 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు.

## పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్



**నరసన్నపేట, డిసెంబర్ 21(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ అవర్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నరసన్నపేట మండల ఎంఈఓ ఉప్పాడ శాంతారావు తెలిపారు. ఆదివారం నరసన్నపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆయా ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు ప్రత్యేక బోధన అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ స్టడీ అవర్స్ ద్వారా విద్యార్థుల్లో విద్యాపరమైన నైపుణ్యాలు పెంపొందించి, పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యమన్నారు. అలాగే విద్యార్థులకు పోషకాహారం అందించే దిశగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలవుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## దేశ సమైక్యతకు హిందూయిజం దోహదం



**మందస, డిసెంబరు 21(వార్త):** దేశ సమైక్యతకు హిందూయిజం ఎంతో దోహదపడుతుందని వక్తలు అన్నారు. హిందూ సమ్మేళనం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో, సభాధ్యక్షునిగా మల్లారెడ్డి రాజు ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ హిందూ ఐక్యతే దేశానికి రక్ష.. హిందువుల ఐక్యత దేశానికి రక్షని అన్నారు. ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం గురించి వివరిస్తూ, దేశ విభజన సమయంలో ప్రకృతి విపత్తుల సమయంలో ఆర్ఎస్ఎస్ ఎంతో కృషి చేసిందని అన్నారు. క్రమశిక్షణ, వ్యక్తి నిర్మాణం, స్వదేశీ ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకుడు కిషోర్ కుమార్ పాత్రో, ఇప్పిలి కేశవరావు(చిట్టి), కిల్లంశెట్టి నరేష్, గోవిందస్వామి, మద్ది లక్ష్మి, సోమేశ్వరరావు, ప్రభాకర్ పట్నాయక్, జగదీష్ పండా, విద్యాసాగర్ పాల్గొన్నారు.







# పోలియోరహిత దేశానికి సహకరించండి

### * ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



**ఆమదాలవలస, డిసెంబర్ 21(వార్త):** పోలియో రహిత దేశంగా భారత్ నిలవడంలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చిన్నారులకు చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలియో వంటి ప్రమాదకర వ్యాధుల నుండి చిన్నారులను రక్షించేందుకు పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమని అన్నారు. ఐదు సంవత్సరాలలోపు ప్రతి ఒక్క చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. సమాజంలో ఆరోగ్యకరమైన భవిష్యత్ నిర్మాణానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయడం వల్లే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతమవుతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, కళాశాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోలియో రహిత భారతదేశం లక్ష్యం



**పలాస, డిసెంబరు 21 (వార్త):** పల్స్ పోలియో కార్యక్రమం వాడవాడల ఆదివారం నిర్వహించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఏ పి టి పి సి చైర్మన్ వజ్జ బాబురావు, ఈఎంసి చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు, కౌన్సిలర్లు దువ్వాడ శ్రీకాంత్, జి సూర్యనారాయణ, తంగుడు ఆశరాణి, శర్వాన గీత మిగతా కౌన్సిలర్లు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. రెంటికోట పి హెచ్ సి ఆధ్వర్యంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు వంకల కూర్మారావు, ఎంపీటీసీలు, సర్పంచులు వారు వారి వారి ప్రాంతాల్లో పల్స్ పోలియో శిబిరంలో పాల్గొని చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. వజ్రపుకొత్తూరు మండలం, గోవిందపురం గ్రామంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, వార్డు మెంబర్ గణేష్, కోఆప్షన్ సభ్యులు విఘ్నేష్, నాగు, సెక్రెటరీ శరత్ చంద్ర, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## పోలియో మహమ్మరిని తరిమికొట్టాలి



**జి.సిగడాం, డిసెంబరు21(వార్త):** పిల్లల ఆరోగ్యం విషయంలో ముందుచూపు అవసరమని రెండు చుక్కలు చిన్నారుల జీవితాన్ని పోలియో బారిన పడకుండా చేస్తాయని డాక్టర్ అనూష, ప్రతిష్ట శర్మ అన్నారు.ఆదివారం బాతువ పీహెచ్ సీ పరిధి అన్ని గ్రామ ఆయుష్ మందిర్ 1920 మంది చిన్నారులకు 92.57 శాతం పల్స్ పోలియో వేసినట్లు వారు తెలిపారు. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి చిన్నపిల్లలకు పల్స్ పోలియో వేశారు. వారు మాట్లాడుతూ పోలియో లాంటి ప్రమాదకర వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు ఈ కార్యక్రమం కీలకమన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

## అందరి సహకారంతోనే పోలియోరహిత సమాజం



**మందస, డిసెంబరు 21(వార్త):** పోలియోరహిత సమాజానికి అందరి సహకారం ఎంతో అవసరమని, దీంతో లక్ష్యాలను చేరుకోగలమని తెలుగు దేశం పార్టీ మందస మందస అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. మందస మండలంలోని బాలిగాం గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలియో రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు 5సంవత్సరాల లోపు ఉన్న వారి పిల్లలకు నిర్లక్ష్యం చేయకుండా పోలియో మోతాదును ఇప్పించి, పోలియో రహిత సమాజానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య, అంగన్వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## పోలియో చుక్కలతో చిన్నారులకు ఆరోగ్యం



చుక్కల మందు చిన్నారుల భవిష్యత్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని మేజర్ పంచాయతీ మందస సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణమూర్తి దంపతులు అన్నారు. మందస పట్టణంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో పిల్లలకు వేసే పోలియో చుక్కలు పునాదిగా నిలుస్తాయన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అన్నారు. భవిష్యత్తులో పోలియో రాకుండా నిర్మూలనకు ఈ చుక్కలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో వైద్య, అంగన్వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజమే లక్ష్యం

**పోలాకి, డిసెంబర్ 21 (వార్త):** పోలియో రహిత సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం పోలాకి మండలం మబగాం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్లలోపు బాలబాలికలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ముందస్తుగా పోలియో చుక్కలు వేయడం ద్వారా పిల్లలను పోలియో వంటి ప్రమాదకర వ్యాధి నుంచి కాపాడవచ్చని తెలిపారు. భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిరంతరంగా కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా చిన్నారులకు జీవితాంతం ఆరోగ్యాన్ని అందించవచ్చని, తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు భద్రంగా ఉండాలంటే ఈ రెండు చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాయ రవి, వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### నరసన్నపేటలో..




పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా నరసన్నపేట మేజర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని సర్పంచ్ బూరల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా పోలియో చుక్కల కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 0 నుంచి 5 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని సూచించారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే తల్లిదండ్రుల సహకారం అత్యంత అవసరమని అన్నారు.

### నిండు జీవితం కోసం పోలియో చుక్కలు అవసరం



**జలుమూరు, డిసెంబర్ 21(వార్త):** ప్రతి చిన్నారికి నిండు, ఆరోగ్యమైన జీవితం అందించాలంటే పోలియో చుక్కలు అత్యంత అవసరమని మండల అభివృద్ధి అధికారి బి.చిన్నముడు అన్నారు. ఆదివారం జలుమూరు మండలం చల్లవానిపేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆమె పాల్గొని పోలియో చుక్కలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అన్నారు. పోలియో వంటి వ్యాధిని సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పంచరెడ్డి రామచంద్ర రావు, మండల విద్యాధికారి బి. మాధవరావు, వైద్యాధికారి జి. సుజాతతో పాటు ఇతర వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. అలాగే జలుమూరు మండలంలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని ఎంఈఓ



బమ్మిడి మాధవరావు పిలుపునిచ్చారు. చల్లవానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఆయన హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల విద్యార్థులతో పాటు ఐదేళ్లలోపు ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులందరూ తప్పనిసరిగా పోలియో చుక్కలు వినియోగించుకోవాలని సూచించారు. చిన్నారులను పోలియో వ్యాధి నుంచి రక్షించేందుకు ఈ కార్యక్రమం ఎంతో కీలకమని తెలిపారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### చీడిపూడిలో పల్స్ పోలియో

**సారవకోట, డిసెంబర్ 21(వార్త):** సారవకోట మండలం చీడిపూడి గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, వరుదు రామశేఖర్ పాల్గొని పల్స్ పోలియో కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.



## అంగవైకల్యం రాకుండా పోలియో చుక్కలు వేయాలి

**సంతబొమ్మాళి,డిసెంబర్ 21 (వార్త):** చిన్నారులకు అంగవైకల్యం రాకుండా పోలియో చుక్కలు వేయాలని నౌపడ ఆసుపత్రి వైద్యాధికారిణి పరిమల అన్నారు. నౌపడ, దండుగోపాలపురం, బోరుభద్ర, సంతబొమ్మాళి గ్రామాల ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో అన్ని గ్రామాలలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నౌపడ ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో శతశాతం చుక్కలు వేశారు. దండుగోపాలపురం పీహెచ్సీ పరిధిలో 885 మంది చిన్నారులకు 868 మంది చిన్నారులకు చుక్కలు వేశామని వైద్యాధికారి విశ్వనాథ్ గంగాధర్ తెలిపారు. బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 1023 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 985 మంది చిన్నారులకు చుక్కలు వేసినట్టు వైద్యాధికారి చిరంజీవి నాయుడు తెలిపారు. సంతబొమ్మాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 805 చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 790 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని వైద్యాధికారిణి డాక్టర్ నందిని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి



**శ్రీకాకుళం,డిసెంబర్ 21(వార్త):** 0-5 వయసు లోపు గల పిల్లలందరూ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేసుకొని పోలియోను తరిమి కొట్టాలని స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టర్ ఆఫీసు దగ్గర గల వాంబే కాలనీలో పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పిల్లలకు పోలియో చుక్కలను శత శాతం పూర్తి అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలియో చుక్కల రాష్ట్ర పరిశీలకులు బి. మీనాక్షి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. రాందాసు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి అనిత మున్సిపల్ కమిషనర్ పి వి వి పి ప్రసాదరావు, ఐసిడిఎస్ పిడి విమల, తదితరులు పాల్గొన్నారు.



## 3926 మందికి పల్స్ పోలియో

**మెలియాపుట్టి డిసెంబరు 21 (వార్త):** మండలంలో మెలియాపుట్టి, చాపర, కరజాడ పీహెచ్సీల పరిధిలో 3926 పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేశామని మెలియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సాయి సత్య గ్రేష్మ ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలో ఇటుకుల బట్టి వద్ద ఉన్న పిల్లలకు సైతం పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది, సచివాలయ, రెవెన్యూ, అంగన్వాడిలు పాల్గొన్నారు.



## నరసన్నపేటలో జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

**నరసన్నపేట, డిసెంబర్ 21(వార్త):** నరసన్నపేటలోని వైసీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారు. మాజీ మంత్రి ధర్మాన కృష్ణ దాస్ పాల్గొని కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంచి పెట్టారు. అనంతరం నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ వేడుకల్లో వైసీపీ ఇన్ఛార్జి ధర్మాన కృష్ణ చైతన్యతో పాటు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పండగ వాతావరణంలో
# జగన్మోహనరెడ్డి జన్మదినోత్సవం

**శ్రీకాకుళం, డిసెంబర్21(వార్త):** జిల్లావ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం పండుగ వాతావరణంలో జరిగాయి. రక్తదాన శిబిరాలు, పేదలకు దుప్పట్ల పంపిణీ, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత వంటి కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గామహాలక్ష్మి ఆలయంలో బగళాముఖి హోమం నిర్వహించి జగన్‌మోహన్‌రెడ్డి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కృష్ణదాస్ ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. నరసన్నపేట నియోజకవర్గంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో సుమారు 150 యూనిట్ల రక్తం సేకరించడం విశేషం. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు పేదలకు దుప్పట్లు అందజేశారు. టెక్కలిలో జరిగిన వేడుకల్లో 300 మందికి పైగా రక్తదానం చేసి పార్టీ శ్రేణులు తమ సేవాభావాన్ని చాటుకున్నారు. భారీ కేక్ కట్ చేసి జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీకి నిలువుటద్దమని, పేదల పక్షపాతిగా పాలన సాగించిన ప్రజా నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగిన జగనన్న పాలన రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు.









## సోంపేటలో జగన్ జన్మదిన వేడుకలు

**సోంపేట, డిసెంబరు 21 (వార్త):** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ జన్మదిన వేడుకలు సోంపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో దివంగత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, జడ్పిటిసి తడక యశోద ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేపట్టారు. వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా అందించిన సేవలు చేపట్టిన కార్యక్రమాలు తదితర అంశాలపై నేతలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మల్లా వెంకటరమణ, పొడుగు కామేసు, గుర్రాల శ్రీను, తెల్లి వైకుంతరావు, బొమ్మిడి ధర్మారావు, బట్టి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

### అనాధ ఆశ్రమంలో..



సోంపేట సమీపంలో గల సీతయ్య ఫౌండేషన్ వానప్రస్థ ఆశ్రమంలో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నేతలు నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సల్ల దేవరాజు, కంచిలి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులు అనాధ బాలల సమక్షంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. శ్యాం ప్రసాద్ రెడ్డి సౌజన్యంతో నారాయణ సేవ పేరిట వృద్ధులకు అనాధ బాలలకు ఆహారాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు కొనపల సురేష్, పైల మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

### నౌపడ వైసీపీ కార్యాలయంలో..



**సంతబొమ్మాలి, డిసెంబర్ 21(వార్త):** నౌపడ వైఎస్ఆర్సిపి కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నౌపడ సర్పంచ్ పి బృందాదేవి, రవికుమార్ రెడ్డి, ఎంపీటీసీలు ఎల్.దమయంతి, బి.సుధాకర్, ఉపసర్పంచ్ వి.రవి, లోపింటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో జగన్ ఒక సంచలనం

*** సీఎంగా గుర్తుండిపోయే పాలన * వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కొనియాడిన నాయకులు**
*** మందసలో ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు**

**మందస, డిసెంబరు 21(వార్త):** రాజకీయాల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలనం సృష్టించారని, దేశ చరిత్రలోనే సీఎంగా గుర్తుండిపోయే పాలన అందించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మందస పట్టణంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా ఒకేసారి 17ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టి, ఉదానం కిడ్నీ బాధితుల కోసం పలాసలో డాక్టర్ వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మించి, రూ:750 కోట్లతో ఉద్దానం ప్రజలకై శుద్ధజలం అందించి, ఒకేసారి 30లక్షల మంది ఇల్లు లేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చి, రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో గొప్ప పథకాలను, ప్రోజెక్టులను అందించి, పరిపాలనా సంస్కరణలను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ప్రజాభిమానమే ఆస్తిగా... స్వార్ధమెరగని నాయకునిగా, ప్రజల గుండెల్లో సుస్థిరస్థానాన్ని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంపాదించుకున్నారన్నారు. వైఎస్ఆర్‌సీపీకి మద్దతుగా ఒక కోటి 4 లక్షల 11 వేల 136 మంది సంతకాలను సేకరించి ఒక గొప్ప చరిత్ర ను సృష్టించారని, జనంతో నడిచి, జనాన్ని ముందుకు నడిపించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దల్లి జానకిరావురెడ్డి, మందస పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, మండల పార్టీ యువజన అధ్యక్షుడు కిషోర్ కుమార్, గిన్ని తిరుపతి రెడ్డి, మందస మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం సంయుక్త కార్యదర్శి సౌర ఢిల్లీరావు, మందస మండలం పార్టీ ఉపాధ్యక్షుడు పులారి పితాంబరం, నియోజకవర్గం బూత్ కమిటీ అధ్యక్షులు చింతాడ గణపతి, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మడియా రామకృష్ణ, నియోజకవర్గం ఐటీ విభాగం అధ్యక్షుడు బత్తిన లక్ష్మణ్, నియోజకవర్గం యువజన అధ్యక్షుడు దున్న హరికృష్ణ, మండల కార్యదర్శి కేశవరావు, బాడ జగన్నాయుకులు, సోషల్ మీడియా సభ్యులు రామారావు, హేమరాజు, జగదీశ్, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారత జగన్‌తోనే సాధ్యం

### పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి




**ఎల్ఎన్‌పేట,డిసెంబర్21(వార్త):** వైయస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో ఎల్ఎన్‌పేట జంక్షన్ వద్ద దివంగత నేత వైయస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. జగనన్న జన్మదిన వేడుకలను మండల స్థాయి కేడర్‌తో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న మహిళా సాధికారత సాధిం చేందుకు విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. అమ్మవడి, విద్యా దీవెన, నాడు నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి, రైతుబరోసా, అందరికీ ఇళ్ళు తదితర పథకాలు ఇచ్చి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డి దేనని కొనియాడారు. జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జ్యోతి లక్ష్మి, జడ్పీటిసి కిలారి త్రినాధులు, మండల అధ్యక్షులు పెనుమజ్జి విష్ణు,జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంభశివరావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు రెడ్డి రామారావు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు ఎం.దివాకర్, లుకలాపు సుధీర్, తొత్తడి మురళీకృష్ణ, ముగడ జనార్ధనరావు, ముద్దాడ లక్ష్మణరావు, బలగ గోవిందరావు, లోచర్ల మల్లేశ్వరరావు, యర్రజనార్ధనరావు, రెడ్డి సీతారాం,కెల్ల గణపతిరావు, రావాడ మన్మధరావు, కొల్ల రాము, గేదెల శ్రీనువాసరావు, పెదకోట రాము, పెనుమజ్జి రామారావు, రామచంద్రుడు, కాగాన సింహాచలం, పైల తవిటినాయుడు, పనుకు క్రిష్ణారావు, చిన్నారావు, పెద్ద ఎత్తున మహిళలు, జగనన్న అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు గొట్టిపల్లి, కరకవలస, కుసుమలపాడు, ఆర్అండ్ఆర్ కాలనీ చిన్నకొల్లివలస, యంబరాం, ఎల్ఎన్ పేట, దబ్బపాడు తదితర గ్రామాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంభశివరావు, మాజీ ఎంపీపీ కుంచాల శ్రీదేవి, ఎంపిపి రెడ్డి జ్యోతి లక్ష్మి, రామారావు, జి. యోగేశ్వరరావు, బుక్క చంద్రరరావు, ముద్దాడ లక్ష్మణరావు, పెద్ద ఎత్తున మహిళలు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పేదల కష్టాలు తీరేదప్పుడే

**మెళియాపుట్టి, డిసెంబరు 21 (వార్త):** జగనన్నే మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని, అప్పుడే పేదల కష్టాలు తీరుతాయని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మాజీముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను మెలియాపుట్టి మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక రాధా గోవిందస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజశేఖర్ రెడ్డి విగ్రహం సమీపంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, అర్హులైన లబ్ధిదారులకు వాలంటరీ వ్యవస్థ ద్వారా పథకాలను అందజేశారన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో బలహీన వర్గాలకు చెందిన ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షులు పోలాకి జైముని రావు, ఎంపీపీ ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, పిఏసిఎస్ పూర్వపు అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, సీనియర్ నాయకులు లింగాల సంజీవరావు, అలికాన మాధవరావు, పల్లి యోగి, బైపోతూ పోతేజేశ్వరరావు, కిరణ్ కుమార్ రెడ్డి, యోగి, వెంకటరమణ, సవర సుభాష్, పలువురు సర్పంచులు. ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.







# ఉత్సాహంగా జగన్ జన్మదిన వేడుకలు

**పలాస, డిసెంబరు 21(వార్త):** వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఉత్సాహ భరితంగా సాగాయి. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాల్లో జన్మదిన వేడుకలు నిర్వహించగా, పలాసలోని ప్రగతి భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రారంభించి స్వయంగా రక్తదానం చేశారు. ఆయనతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రక్తదాన శిబిరంలో టెక్కలి బ్లడ్ బ్యాంక్ డాక్టర్ సునీత, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సోమేశు, పాపారావు, టి దిప్తి పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సీదిరి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల ప్రజలు ఎంత సంతోషంగా జీవించారో వివరించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కష్టాల గురించి కూడా వారు ప్రస్తావించారు. వచ్చేది మరలా మన ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేస్తూ, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.



## నరసన్నపేటలో కాళింగ సంక్షేమ సంఘం వనభోజన మహోత్సవం




**నరసన్నపేట, డిసెంబర్ 21(వార్త):** నరసన్నపేట పంచాయతీ పరిధిలోని కాళింగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవం పోలాకి రోడ్డులోని చల్లబందతోటలో ఆదివారం నిర్వహించారు. సంఘం అధ్యక్షులు ఉప్పాడ పూర్ణారావు, గౌరవ అధ్యక్షులు, కమిటీ సభ్యుల నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ఉప్పాడ పూర్ణారావు మాట్లాడుతూ, సంఘం ఏర్పాటైనప్పటి నుంచి గత మూడు సంవత్సరాలుగా నిరంతరంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ వన భోజన మహోత్సవంలో రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కాళింగ విభాగం అధ్యక్షులు, ఎంపీపీ ఆరంగి మురళీధర్, ప్రముఖ వైద్యులు బెండి ఆనందరావు, బలగ మురళితో పాటు సంఘ సేవకులు మార్పు విజయ్, కమిటీ సభ్యులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



## ఆర్జీయూకేటీలో ప్రపంచ ధ్యాన దినోత్సవం

**ఎచ్చెర్ల, డిసెంబర్21(వార్త):**రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో యోగా విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరితో సామూహిక ధ్యాన ప్రక్రియ చేయించి, నిత్య జీవితంలో ధ్యానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల్లో మానసిక ప్రశాంతతను, ఏకాగ్రతను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ వేడుకల్లో క్యాంపస్ సంచాలకులు ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట ధనబాలాజీతో పాటు విశ్వవిద్యాలయ అధికారులు డాక్టర్ ముని రామకృష్ణ, డాక్టర్ శివ రామకృష్ణ, డాక్టర్ వాసు, డాక్టర్ రవి గేదెల, యోగ శిక్షకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం, డిసెంబర్ 21 (వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సోమవారం జిల్లా పరిషత్‌లో నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నేరుగా పై కార్యక్రమములో లేదా ఆన్లైన్‌లో మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేయాలన్నారు. నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

## నేడు క్రిస్టమస్ వేడుకలు

**శ్రీకాకుళం, డిసెంబర్ 21 (వార్త):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో క్రిస్టమస్ హైటీ ఉంటుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం వెల్లడించారు. సోమవారం ఉదయం 11 గంటలకు కోడి రామమూర్తి మైదానం ప్రక్కన గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో క్రిస్టమస్ వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రజలు పాల్గొనాలని కోరారు.

## ఎర్రన్నపేటను ప్రత్యేక పంచాయతీ కేంద్రంగా ఏర్పాటు చేయాలి



**జలుమూరు, డిసెంబర్ 21(వార్త):**జలుమూరు మండలంలోని టియ్యల్పాడు పంచాయతీ పరిధిలో ఉన్న ఎర్రన్నపేటను ప్రత్యేక పంచాయతీ కేంద్రంగా ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. మారుమూల గ్రామాలైన సంతల భైలి, ఎర్రన్నపేటలను కలిపి ఒక ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని డాక్టర్ బలగ కృష్ణ, యూత్ చంటిబాబు, యుగంధర్, బి.అన్నమనాయుడు తదితరులు ఎమ్మెల్యేను కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు పాలనా సౌలభ్యం కోసం ప్రత్యేక పంచాయతీ అవసరమని వారు వివరించారు.

## గొప్పిలిలో వరికుప్ప దగ్ధం



**మెళియాపుట్టి డిసెంబరు 21 (వార్త):**గొప్పిలి గ్రామంలో పిట్ట శంకరరావుకి చెందిన వరిచేను కుప్ప దగ్ధమైంది. బాధితుడు శంకర్రావుతోపాటు గ్రామస్తులు తెలియ జేసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం శంకరరావుకి సంబంధించి ప్రక్కనున్న పొలంలో ఉన్న గడ్డిని కాల్చడానికి వేరేరైతు గడ్డికి మంటపెట్టాడు. ఈ మంటలు గాలికి ఎగిరి వరికుప్ప వైపు రావడంతో నిప్పురాజుకుందన్నారు. రైతులు వెంటనే పలాస అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించిన వెంటనే అగ్నిమాపక వాహనం వచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

## కామ్రేడ్ నర్తు సీతారాం మార్గమే అనుసరణీయం

**మందస, డిసెంబరు 21(వార్త):** కామ్రేడ్ నర్తు సీతారాం చూపిన మార్గమే అనుసరణీయమని కమ్యూనిస్టు పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మందస మండలంలోని లొహరిబంద పంచాయతీ గొల్లలపాలేంలో కామ్రేడ్ నర్తు సీతారాం సంతాప సభ జరిగింది. మాజీ ఎంపీపీ ప్రతినిధి దాసరి తాతారావు అధ్యక్షత వహించిన సంతాప సభను ఉద్దేశించి పలువురు కమ్యూనిస్టు పార్టీ నాయకులు మాట్లాడుతూ లౌకిక ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ రాజ్యాంగ వ్యవస్థలను మోడీ ప్రభుత్వం ధ్వంసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది మంది పేద ప్రజలకు ఆర్థిక ప్రోత్సాహంగా నిలిచిన ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం పేరు మార్చడమే కాకుండా నిధులు కోత కూడా విధించి ప్రజలకు తీరని ద్రోహం చేస్తుందన్నారు. కామ్రేడ్ సీతారాం అన్ని కమ్యూనిస్టు పార్టీలతో ఆచరణాత్మక సంబంధాలు కలిగి ఉండడం అందరినీ ఒకరి వేదిక మీదకు తీసుకువచ్చే సందర్భానికి పునాది వేసింది. ఆశ్చర్యానికి గురి చేసే అంశమే అయినప్పటికీ మోడీ చేస్తున్న అభివృద్ధి విధ్వంశాన్ని దృష్టిలో పెట్టుకొని కమ్యూనిస్టులందరూ ఐక్యమవ్వాలని ఈ సంతాప సభ దిశా నిర్దేశం చేసిందన్నారు. కామ్రేడ్ నర్తు సీతారాం సంతాప సభ ఈ రకంగా ఒక చారిత్రకమైన పాత్ర పోషించిందన్నారు. సంతాప సభను గొల్లలపాలెంలో వారి కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సీతారాం జ్ఞాపకార్థం నిర్మించిన స్తూపాన్ని సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు పాతిని కృష్ణమూర్తి ఆవిష్కరించారు. సీపీఎం పార్టీ నాయకుడు బమ్మిడి ఆనందరావు, లిబరేషన్ పార్టీ నాయకులు సన్యాసిరావు, మద్దిల రామారావు, కోనారి ఈశ్వరి, న్యూ డెమోక్రసీ నాయకులు గౌరకల బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, మామిడి భీమన్న, జనశక్తి నాయకులు, రాజేష్, కోనేరు రమేష్, మహిళా సంఘం నాయకురాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు. ప్రజా కళామండలి నాయకులు నీలకంఠం బృందం నేతృత్వంలో ఆలాపించిన చైతన్య గీతాలు ఆకట్టుకున్నాయి.



# ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

### * ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.అనిల్ కుమార్

**మందస, డిసెంబరు 21(వార్త):** ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేస్తామని చెప్పి, రోజుకో కొత్త కార్యక్రమాలను విద్యాశాఖలో ప్రవేశపెడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.అనిల్ కుమార్ అన్నారు. మందస పట్టణంలోని ఉన్నత పాఠశాలలో జరిగిన ఏపీటీఎఫ్ మందస శాఖ కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని ప్రస్తుత విద్యారంగ పరిస్థితులపై మాట్లాడారు. ఇటీవల కాలంలో ముఖ్యంగా గిరిజన సంక్షేమ పాఠశాలలో రెగ్యులర్ వార్డెన్ పోస్టులు, ఏఎన్ఎం పోస్టులు మంజూరు చేయకుండా అక్కడ ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడమే కాకుండా సంబంధిత శాఖాధికారులు ఆయా పాఠశాలలో అర్ధరాత్రి తనిఖీలు చేస్తూ ఉపాధ్యాయులుని మానసికంగా ఇబ్బంది పెట్టడం, ఇంకా చాలా పాఠశాలల్లో విద్యాశక్తి, 100 రోజుల ప్రణాళిక,75రోజుల జీఎఫ్ఎల్ఎన్ ప్రణాళికపై ఆన్లైన్ నమోదు, ముస్తాబు వంటి బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా సీపీఎస్ రద్దు, వారి డీఏ బకాయిలు విడుదల, పీఆర్సీ అమలుకు చర్యలు, ఐఆర్ ప్రకటన, పెండింగ్ డీఏలు విడుదల తదితర అంశాలపై మందస మండల శాఖ తీర్మానం చేసి జిల్లా, రాష్ట్ర నాయకత్వం అందించే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటుగా జిల్లా రాష్ట్ర కౌన్సిలర్ బి.సుభాష్ బాబు, ఉపాధ్యక్షుడు జి.గోపీకృష్ణ, జి.భీమారావు, బి.ఢిలేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎస్.చాణక్య, జిల్లా నాయకుడు బి.లక్ష్మణమూర్తి, పొత్తంగి-సిరిపురం, కృష్ణాపురం ప్రధానోపాధ్యాయులు ఎన్.తారకేశ్వరరావు, పి.మన్మధరావు, మందస ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు పి.మల్లికార్జునరావు, ఏపీటీఎఫ్ మందస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### ఏపీటీఎఫ్ మందస నూతన కార్యవర్గం ఎన్నిక

మందస ఉన్నత పాఠశాలలో జరిగిన ఏపీటీఎఫ్ మందస కార్యవర్గ సమావేశంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ మందస మండల శాఖ అధ్యక్షులుగా బమ్మిడి బైరాగి, ప్రధాన కార్యదర్శిగా బత్తిన రామారావు, ఉపాధ్యక్షులుగా సింహాచలపతి, పీటీజీ గైర్వాణి, షేక్ హమీద్, వైకుంఠబెహరా, మండల కార్యదర్శులుగా ఆర్.లక్ష్మణ రావు, ఎస్.జగదీష్, శ్యామలగౌరీ, డి.మోహనరావు, పి.తాతారావు, నిర్భదోలిమ్మా, జిల్లా కౌన్సిలర్లుగా కె.సుందరరావు, ఎన్.కరుణాకర్, డి.వైకుంఠరావు, ఎన్.ఢిల్లేశ్వరరావు, బి.తిరుపతిరావు, డి.చంద్రశేఖర్, ఎస్.కిరణ్ కుమార్, సుశాంత్ కుమార్ రౌలో, బి.మురళీమోహన్, కె.జగదీశ్వరరావు, టి.ఉదయశ్రీ, ఎస్.నారాయణరావు, వై.సుజాత, ఎస్.ప్రసాదరావు, కె.పాపారావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా కె.చిరంజీవి, ఎస్.జగన్నాధరావు, డి.వెంకట్, ప్రసన్నకుమార్ నందో, టి.ఖగేష్, ఎస్.ఉదయ్, తులేశ్వరకుమార్, అకాడమిక్ కమిటీ సభ్యులుగా ఎస్.గణేశ్వరరావు, బి.పురుషోత్తం, వై.రవికుమార్, గోపినాధ్ బెహరా, బి.శ్రీనివాసరావు, పి.పూర్ణ చంద్రరావు, డి.రామారావు, డి.మన్మధ, వేణుగోపాల్, ఇతర కార్యవర్గ సభ్యులుగా పి.సత్యం, ఎం. చిత్రసేను, ఎస్.కోటేశ్వరి, వి.పల్లవి, ఎం.కోదండపాణి, జి.హేమలత, టి.గంగారావు, గిరిధర్, ఎస్.మాధవి, తనూజా, బి.వరప్రసాదరావు, హనీఫా, కె.ధనరాజు తదితరులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు పరిశీలకులుగా ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు బి.సుభాష్ బాబు, ఎస్.చాణక్య వ్యవహరించారు.



## ఉత్సాహంగా సామూహిక గణిత ప్రతిభా టెస్ట్




**పలాస, డిసెంబరు21 (వార్త):**ప్రముఖ గణితశాస్త్ర నిపుణులు శ్రీనివాసరామానుజము జయంతి, జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా రామక్రిష్ణపురములో శ్రీ సత్యసాయి విద్యావిహార్ నిర్వహించిన పలాస నియోజకవర్గ స్థాయి సామూహిక గణిత ప్రతిభా టెస్ట్ నిర్వహించారు. వివిధ మండలాలనుండి మొత్తం 33 టీమ్‌లు ఆదివారం పాల్గొనగా ప్రథమ స్థానాన్ని శ్రీ చైతన్య హైస్కూల్ కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానములో గీతము టాలెంట్ స్కూల్ హరిపురం, తృతీయ స్థానంలో నగరముపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిలిచారు. ప్రథమస్థానములో గెలుపొందినవారికి 3,000/, ద్వితీయ స్థానములో నిలిచిన వారికి 2000, తృతీయస్థానము సాధించిన జట్టుకు 1000 నగదు బహుమతులుతో పాటుగా సర్టిఫికెట్స్, మెమోంటోలను ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, గణిత ఉపాధ్యాయులు అర్జున్, గిరిధర్, అరుణ్, లావణ్యక్రిష్ణ, ఝాన్సీ, మనీషా, మురళి అనుదీప్, సూర్యతేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీల్లో కౌశల్ ప్రతిభ




**పలాస, డిసెంబరు21 (వార్త):**2025 రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలలో పాల్గొన్న బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పోతనపల్లి కౌశల్‌కు ప్రముఖ సంఘ సేవకుడు, బొడ్డపాడు తెలుగుదేశం నాయకుడు ఢిల్లీరావు అభినందించారు. బొడ్డపాడు గ్రామంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్ లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

## జిల్లా గ్రంథాలయ చైర్మన్‌తో భేటీ




**పలాస, డిసెంబరు21 (వార్త):**జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా పీరుకట్ల విఠల్ రావు నియామకమైనందున టీడీపీ నాయకులు హనుమంతు మురళీమోహన్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయం చైర్మన్ విఠల్ మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకాన్ని ఉంచి ఈ పదవిని కట్టబెట్టారన్నారు. నియోజవర్గంలో పార్టీ సంక్షేమం కోసం, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వీరఘట్టపు వెంకటరావు, కుమార్ నాయక్‌లు సైతం పీరుకట్లకు అభినందనలు తెలియజేశారు.


## జిల్లా గ్రంథాలయ చైర్మన్ విఠల్‌కు అభినందనలు

**పలాస, డిసెంబరు21 (వార్త):** శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా ఎన్నికైన పీరుకట్ల విఠల్‌ను కూటమి నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



అభినందనలు తెలియజేసిన వారిలో బిజెపి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్కోజి ధర్మారావు, సీనియర్ నాయకులు యోగి, బోండా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## జనసేన సారధిగా బీన ప్రదీప్




**సోంపేట, డిసెంబర్ 21(వార్త):** సోంపేట మండల జనసేన సారధిగా ఆ పార్టీ యువనేత బీన ప్రదీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి దాసరి రాజు ఆధ్వర్యంలో ఆదివారం సోంపేటలో జరిగిన పార్టీ మండల కార్యవర్గ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎంతోమంది ఆశవాహులు అధ్యక్ష స్థానం కోసం పోటీ పడినప్పటికీ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రదీప్ వైపే మొగ్గు చూపారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు మండలంలో పార్టీ పటిష్టతకు ఎనలేని విధంగా కృషి చేస్తున్న ప్రదీప్‌కు మెజారిటీ క్యాడర్ మొగ్గు చూపించారు. నిరంతరం పార్టీ కార్యక్రమాలతో చురుగ్గా ఉంటూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ మండలంలో గ్రామ గ్రామాన తిరిగి పార్టీ పటిష్టత కోసం ప్రదీప్ చేస్తున్న కృషిని నేతలు గుర్తించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల్లో భాగస్వామి అయి పార్టీ కార్యకర్తగా కాకుండా పార్టీ సేవకునిగా నిరంతరం ప్రదీప్ అందిస్తున్న సేవలు ప్రతి ఒక్కరిని ఆకర్షించాయి. ఎన్నో విధాలుగా ఈక్కులు పనినప్పటికి అధిష్టానం ఆదేశాల మేరకు దాసరి రాజు ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించి కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ప్రదీప్ ను అభినందించారు. కార్యక్రమంలో మండలములోని 23 పంచాయతీల నుంచి కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు ప్రారంభం



**సోంపేట, డిసెంబర్ 21(వార్త):** తోటవూరు మంకినమ్మవారిగుడి నుంచి ఎకువూరు ఉప్పుటేరు వరకు ఎన్ఆర్ఈజిఎస్ రూ 30 లక్షల నిధులతో రోడ్డు పనులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్ ఆదివారం ప్రారంభించారు. దశాబ్దాల కల కూటమి హయాంలో నెలవేరతున్నందుకు సిరిమామిడి, ఉప్పలాం పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు చొరవ తీసుకున్న చంద్రమోహన్‌కు టీడీపీ నేతలు బడే తమ్మారావు, సూరి, ఈశ్వరరావు, కృష్ణారావు, బైపల్లి పేరయ్య, మండల మహిళా టీడీపీ అధ్యక్షురాలు శ్యామల కృతజ్ఞతలు తెలిపారు

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం




**మెళియాపుట్టి డిసెంబరు 21 (వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృ త్వంలోని కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, పరిపాలన సాధ్యమని దేశం మండల పార్టీ అధ్యక్షుడు నంబాల వెంకట రావు అన్నారు. పాతపట్నంలో పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మావిడి గోవిందరావు నేతృత్వంలో దేశం పార్టీ అబ్జర్వర్ శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో మెళియాపుట్టి మండలం నుండి వైయస్సార్సీపీ నుండి పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలతో ఆదివారం టీడీపీలో చేరారు. ఆ పార్టీ విధానాలకు ఆకర్షితులై చేరినట్టు మెళియాపుట్టి జడ్పిటిసి సభ్యులు గూడ ఎండయ్యా, వసుంధర గ్రామ ఉపసర్పంచ్ మురళి ప్రధాన్ రమేష్ బిస్వాల్, మిన్న ప్రధాన్, బాబు నాయక్, సిరియాకండి సర్పంచ్ తాడేల రామరాజుతో పాటు వారి అనుచరులు, బాణాపురం మాజీ సర్పంచ్ నిక్కల బాబురావుతో పాటు వారి అనుచరులు తదితరులు దేశం పార్టీలో చేరారని వెంకటరావు తెలిపారు. ఈ పార్టీలో చేరికల కార్యక్రమంలో పార్టీ అబ్జర్వర్ శ్రీనివాస్ రెడ్డితో పాటు స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు, కోసమాల బిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు , అభిమానులు పాల్గొన్నారన్నారు.

## శ్రీముఖలింగంలో శక్తి యాప్‌పై అవగాహన




**జలుమూరు, డిసెంబర్21(వార్త):**జలుమూరు మండలం శ్రీముఖలింగంలో ఆదివారం శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు పాల్గొని, గ్రామస్థులకు శక్తి యాప్ పనిచేసే విధానాన్ని వివరించారు. మహిళల భద్రతకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇటీవలి కాలంలో పెరుగుతున్న ఆన్లైన్ మోసాలు, సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా అపరిచితులు పంపే సందేశాలు, లింకులు, కాల్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ప్రతి మహిళ తన ఫోన్‌లో శక్తి యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో ఇది వెంటనే సహాయాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థుల్లో సైబర్ భద్రతపై అవగాహన పెరిగిందని, మహిళల రక్షణకు శక్తి యాప్ కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## రెంటికోటలో నారీశక్తిపై అవగాహన



**పలాస, డిసెంబరు 21 (వార్త):** రెంటికోట గ్రామంలో ఆదివారం నారీ శక్తిపై కాశీబుగ్గ పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్ఐ ఆర్ నరసింహమూర్తి మాట్లాడుతూ ఎవరైనా మహిళలను వేధిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు, పిల్లల భద్రతకు శక్తీ యాప్ దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546